సాక్షి
శ్రీకాకుళం

సోమవారం ; 13 ; జనవరి ; 2025



రారండోయ్ జాతర చూద్దాం

కోటపాలెం భద్రమహంకాళీ జాతర మంగళవారం మొదలుకానుంది. ఏర్పాట్లు పూర్తయ్యాయి. -10లో



కాంప్లెక్స్ కిటకిట

పండగ ప్రయాణికులతో బస్సు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. వాహనాలు కిక్కిరిసిపోతున్నాయి. -10లో



జానపద సంబరాలు

సంక్రాంతి జానపద సంబరాలు అలరించాయి. రెండు తెలుగు రాష్ట్రాల కళాకారులు వచ్చారు. -10లో

న్యూస్‌రీల్

20లోగా అన్నీ కూల్చేయండి

అరసవల్లి: 'రథసప్తమి పండగను రాష్ట్ర పండుగగా వైభవంగా జరుపుకోవాలి. ఇందుకోసం ఆలయం ముందు ఏ నిర్మాణం కనిపించకూడదు. ఉన్నవన్నీ కూల్చేయండి..' అంటూ రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ పరిసరాలల్లో రథసప్తమి ఏర్పాట్లను కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడుతో కలిసి ఆయన పరిశీలించారు. ఆదిత్యుని ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ఈనెల 20 కల్లా ఆలయం ముందు నిర్మాణాలను తొలగించాలని ఈఓ వై.భద్రాజీని ఆదేశించారు. ఆలయం ముందున్న రేకుషెడ్లను వెంటనే తొలగించాలని, అలాగే ఈశాన్యం గేటు నుంచి నేరుగా ఆలయం ముందు వరకు సీసీ రోడ్డు వేయాలన్నారు. అడ్డుగా ఉన్న ఇళ్లను కూడా తొలగించాలన్నారు. నిర్వాసితులకు అవసరమైతే చట్టం ప్రకారం నష్టపరిహారం లేదా ఇళ్ల స్థలాన్ని ఇస్తామని ప్రకటించారు. నిర్వాసితుల ఇష్టప్రకారమే నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. తొలగింపులు, కూల్చివేతల బాధ్యతంతా ఎమ్మెల్యే శంకర్‌దేనని తెలియజేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తిరుపతి, అన్నవరం, కాణిపాకం తరహాలో అరసవల్లి క్షేత్రం కూడా అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, త్వరలో ప్రసాద్ పథకాన్ని వర్తించేలా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పనిచేస్తున్న దినసరి వేతనదారులంతా మంత్రిని కలిసి తమకు గత 10 నెలలుగా జీతాలివ్వడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, తగు చర్యలు చేపట్టాలని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు సూచించారు. భవనాల కూల్చివేతపై స్థానికులు, వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు మళ్లీ ప్రారంభం



ర్యాంపు రోడ్ బాగుచేస్తున్న దృశ్యం

గార: మండల కేంద్రం సమీపంలోని డీ-సిల్టేషన్ ర్యాంపులో ఇసుక అక్రమ తవ్వకాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. గార ర్యాంపు సమీపంలోని రక్షిత నీటి పథకం గ్యాలరీ, గ్యాబ్రియన్ వాల్, వ్యవసాయ బోర్లు వంటివి ఉండటంతో నష్టాలపై పలు మార్లు 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో కలెక్టర్ దృష్టి సారించి తవ్వకాలను నిలిపివేయించారు. నిబంధనలు పాటించకపోవడంపై దృష్టి సారించడం, ఈలోగా డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు వంశధార నదిలో కొద్దిగా ప్రవాహం పెరగడంతో తవ్వకాలు ఆగాయి. లోపటికి వెళ్లేందుకు వేసిన ర్యాంపు తోవ దెబ్బతింది. గత రెండు రోజులుగా ర్యాంపు రోడ్ బాగుచేయడంతో పాటు నదిలో జేసీబీ వాహనాలతో ఇసుక లోడింగ్ చేసి ఒడ్డుకు తీసుకువచ్చి డంపింగ్ చేస్తున్నారు. వాస్తవానికి నీటి పంపింగ్ ద్వారా తీసిన ఇసుకను స్టాకు చేసి ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఇసుకను ఇవ్వాలన్నది ఉద్దేశం. ర్యాంపు వద్ద వీఆర్‌ఓ, పంచాయితీ కార్యదర్శి సిబ్బంది ఉండాల్సి ఉన్నా, సెలవులతో పాటు సంక్రాంతి సెలవులు రావడంతో అక్రమ ఇసుక తవ్వకాలు జోరందుకున్నాయి. పగలు స్టాక్ పాయింట్ వరకు వేస్తున్నా రాత్రి పూట వాహనాల్లో తరలిపోతుందని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఊరు ఉసూరు



పల్లె గూటికి చేరని పండగ



ఈ చిత్రం చూడండి. శ్రీకాకుళం కలెక్టరేట్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుందువానిపేట కాలనీ ఇది. భోగికి ముందు రోజు ఉన్న దృశ్యమిది. సంక్రాంతి వేళ సందడిగా, జనాలతో కళకళలాడాల్సిన కాలనీ నిర్మానుష్యంగా ఉంది. పండక్కి చేతిలో సరిపడా డబ్బులేక ఈ ఊరు ఉసూరుమంటోంది.

కుందువానిపేట కాలనీ రోడ్డుపై ఉన్న సిమెంట్ దిమ్మల మీద కూర్చొన్న ఆడ, మగవాళ్ల పండగ ఎలా చేసుకుంటున్నారని 'సాక్షి' ఆరా తీయగా.. ఆవేదన వెళ్లగక్కారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని, పండగ పూట ఉచితంగా సరుకులైనా ఇవ్వలేదని అన్నారు. వేటకెళితే చేపలు దొరకడం లేదు. ప్రభుత్వం మత్స్యకార భరోసా కూడా ఎగ్గొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. గత ఐదేళ్ల సంక్షేమ పథకాల వల్ల ఎంతోకొంత డబ్బు పండగ సమయంలో చేతిలో ఉండేదని, ఈ ఏడాది ఆ భాగ్యం లేదన్నారు.





ఇప్పిలి రోడ్డులో రచ్చబండపై కూర్చున్న వాళ్లను 'పండక్కి దుస్తులు కొనుకున్నారా..?' పిండి వంటలు చేసుకున్నారా..? అని సాక్షి అడగ్గా.. కూర్చోపోతే ఏం చేయాలి. చేయడానికి ఏమీ లేదు. పండగ పూట దిగాలుగా ఉన్నాం. అని బాధనంతా వెళ్లగక్కారు. ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వలేదు. ఆడోళ్లకు ఆసరా డబ్బులు పడలేదు. పిల్లలకు అమ్మ ఒడి వేయలేదు. డబ్బులేకపోతే ఎక్కడికెళ్తాం.. ఏం చేస్తాం...మా పండగ ఇంతే అని చెప్పుకొచ్చారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

- చిన్నబోతున్న పెద్ద పండగ
- పల్లెల్లో కళ తప్పిన సంక్రాంతి
- చేతుల్లో డబ్బులు లేవంటున్న పల్లె ప్రజలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక దయనీయ పరిస్థితి
- ఇప్పిలి, కుందువానిపేటలో 'సాక్షి' పరిశీలన
- పండగ పూట రేషన్ సరుకులు పూర్తిగా ఇవ్వని దుస్థితి

ఊరు ఉసూరుమంటోంది. గత ఐదేళ్ల సంక్షేమ పథకాలతో కళకళలాడిన పల్లెలు ఈ ఏడాది ఆ భాగ్యానికి నోచుకోలేదు. అప్పట్లో ఏడాదంతా సంక్షేమం అమలు కావడం వల్ల పండగ పూట చేతిలో కాసింత డబ్బుండేది. పండగ ఖర్చులు ఆ డబ్బుతో గట్టెక్కేవి. కానీ ఈ సారి నేతల మాటలు కోటలు దాటాయి తప్పితే.. ఖాతాలో రూపాయి పడలేదు. పండగ పూట పల్లె పరిస్థితిని పరిశీలించడానికి 'సాక్షి' 800 గడపలున్న కుందువానిపేట, కుందువానిపేట కాలనీలను ఆదివారం పరిశీలించింది. భోగికి ముందు రోజు కాలనీ పండగ సందడికి దూరంగా ఉంది. పక్కనే ఉన్న ఇప్పిలిలోనూ అదే పరిస్థితి కనిపించింది.



ఒక వైపు పంటలు గిట్టుబాటు కాలేదు. ఇటీవల వర్షాలకు పండిన పంటలు కూడా పాడయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో ఏం చేయలేని దుస్థితిలో ఉన్నామంటూ ఇక్కడ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు పల్లెలే కాదు జిల్లాలో ఉన్న పల్లెలన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఉంది. పైసల్లేక పెద్ద పండగ చిన్నబోతోంది.



నాడు వేడుక..

గత ఐదేళ్ల పంటలకు గిట్టుబాటు ధరలు, రైతులకు భరోసా సొమ్ము, మహిళలకు ఆసరా డబ్బులు, చేతివృత్తుల వారికి జగనన్న తోడు, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు వాహనమిత్ర, పిల్లల కోసం అమ్మ ఒడి, మత్స్యకారులకు భృతి వంటివి అమలు జరిగేవి. దీంతో పల్లెల్లో సంక్రాంతి పండగ ఒక వేడుకగా జరిగేది.

నేడు వేదన

ఇప్పుడా పరిస్థితి మారింది. చేతిలో డబ్బుల్లేక రైతులు, పథకాల నగదు లేక మహిళలు, చేయూత అందక మిగతా వర్గాలు ఈసురోమంటున్నాయి.

పెరిగిన ధరలు..

సంక్రాంతి పండగ వస్తుందంటే వారం రోజుల ముందు నుంచే ఇళ్లల్లో పిండి వంటలు ఘుమఘుమలాడేవి. ఈ ఏడాది మాత్రం పండగ పూట సామాన్యులకు నిత్యావసర సరుకుల ధరలు షాకిస్తున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు పిండి వంటలకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. వంటనూనె ధరలు రోజు రోజుకు సలసలా కాగుతున్నాయి. నెలల వ్యవధిలో నూనె ధరలు 10నుంచి 15శాతం పెరిగాయి. ఇక, బియ్యం, గోధుమ పిండి, శనగపప్పు, కందిపప్పు, మినప పప్పు, పెసర పప్పు, చక్కెర, బెల్లం తదితర ధరలన్నీ చుక్కలనంటాయి. దాదాపు 10 నుంచి 15శాతానికి పైగా ధరలు పెరిగాయి. పోనీ, ప్రభుత్వమైనా కానుకలు ఇచ్చిందా అంటే అదీ లేదు. కనీసం రేషన్ డిపోల్లో పప్పులు కూడా అందరికీ ఇవ్వలేదు.

జగన్ హయాంలో పథకాలు వచ్చేవి



ఇదివరకు జగన్ హయాంలో అన్ని పథకాలు అమలు కావడంతో పండగ సమయంలో డబ్బులు చేతిలో ఉండేవి. చంద్రబాబు వచ్చాక పథకాల్లేవు. డబ్బులూ లేవు. ఈ ప్రభుత్వంలో ఇబ్బందులు పడుతున్నాం. కనీసం సంక్రాంతి కానుకలు కూడా ఇవ్వలేదు.
– దాసరి నర్సింహులు, కుందువానిపేట,

అప్పు చేయాల్సిందే..



అప్పు చేస్తే తప్ప పండగ చేసుకోలేం. ఈ ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదు. చివరకు తెప్పల డబ్బులు(మత్స్యకార భరోసా) ఇవ్వలేదు. పిల్లలకు అమ్మ ఒడి డబ్బులు ఇవ్వలేదు. ఇలా సంక్రాంతి ఎప్పుడూ లేదు. జగన్ ఉన్నంత కాలం పథకాలతో పండగలు బాగా చేసుకునే వాళ్లం.
– దాసరి తులసమ్మ, కుందువానిపేట కాలనీ

ఈసారికి ఇంతే..



జగన్ హయాంలో సంక్రాంతి పండగ బాగా జరుపుకునేవాళ్లం. ఈ ప్రభుత్వం ఇంతవరకు ఒక్కపైసా ఇవ్వలేదు. మత్స్యకారులకు భృతి కూడా ఇవ్వలేదు. బాబు వచ్చాక రూపాయి వస్తువు ఎరగం. ఈ సంక్రాంతికి ఇంతేలా ఉంది.
– దాసరి కామమ్మ, కుందువానిపేట కాలనీ

పండగ లేదు..



గతంలో సంక్రాంతి నాటికి చేతిలో డబ్బులు ఉండేవి. ఆనందంగా పండుగ జరుపుకునేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. చంద్రబాబునాయుడు తల్లికి వందనం ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పి ఒక్కరికైనా ఇవ్వలేదు. అప్పులున్నాయని చంద్రబాబుకి ముందు తెలియదా..? పండుగా లేదు సంక్రాంతి కానుక లేదు ఇదీ ఈ ప్రభుత్వం పాలన. – మైలపల్లి లక్ష్మి, కుందువానిపేట, శ్రీకాకుళం రూరల్‌మండలం

మత్స్యకార భరోసా లేదు



చంద్రబాబు మత్స్యకార భరోసా ఇవ్వలేదు. సంక్రాంతి కానుక కూడా లేదు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే గాలికొదిలేసింది. ఇదివరకు సంక్రాంతి సమయానికి చేతి నిండా డబ్బులుండేవి ఆనందంగా జరుపుకొనేవాళ్లం.
– చీకటి అప్పయ్య, కుందువానిపేట, శ్రీకాకుళం రూరల్ మండలం.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



నులివెచ్చని భోగి మంటల వెలుతురు వెనుక అనేక ఆచారాలు దాగి ఉన్నాయి. మంట వేయడానికి, నలుగు పెట్టడానికి, పిడకల తయారీకి అన్ని పనుల వెనుక పరమార్థాలు ఉన్నాయి. కాలం మారిపోయాక సెల్‌ఫోన్ల సెర్చ్ ఇంజిన్లలో తప్ప గోడలపై పిడకల జాడలు కనిపించడం లేదు. అక్కడైనా కొని పిడకలు మంటలో వేయడం కాసింత ఆనందకరమే. నలుగు పెట్టడం గతమైపోయినా.. అక్కడక్కడా దాని ప్రాశస్త్యాన్ని గుర్తిస్తున్న వారు ఇంకా కొందరున్నారు. వీటితో పాటు అనేక ఆచారాలు నేడు కనుమరుగైపోతున్నాయి.
– టెక్కలి/శ్రీకాకుళం కల్చరల్

భోగి మంట..

ఆచారాలు బోలెడంట..



శ్రీకాకుళం నగరంలో భోగి మంట వద్ద సందడిగా..

ఆదివారంపేట నుంచి ఆన్‌లైన్ వరకు..

ఇంతకుముందు తరం వారికైతే పిడకలు విరివిగా దొరికేవి. కానీ ఇప్పుడు భోగికి పిడకలు కనిపించడం లేదు. పల్లెల్లో అక్కడక్కడా కొందరు పిడకలు చేసుకుంటున్నా.. పట్టణ వాసికి ఆ భాగ్యం లేదు. దీంతో మరేం చేస్తాడు. షరా మామూలుగానే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారంలో వేట సాగిస్తున్నాడు. అమేజాన్‌లో ఇప్పటికే పిడకలకు రేటు కూడా ఫిక్స్ చేశారు. ఒక ప్యాకెట్ రూ.120 చొప్పున అమ్ముతుంటే అదే భాగ్యమని కొనుక్కుంటున్నారు. జిల్లా కేంద్రంలో అయితే కొందరు వ్యాపారులు పిడకలను ప్యాకెట్‌గా చేసి అమ్ముతున్నారు కూడా.



ఆన్‌లైన్‌లో ఆర్డర్




చిన్నతనం నుంచి భోగి మంటలో పిడకలు వేయడం అలవాటు. కానీ ఇప్పుడు పిడకలు దొరకడం లేదు. అందుకే అమెజాన్ నుంచి ఆర్డర్ చేసుకుంటున్నాం.
– జి.ఆదిత్య, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, శ్రీకాకుళం

మార్కెట్‌లో కొంటున్నాం



భోగి పిడకలను భోగి మంటలో వేయడం మన పెద్దల ఆనవాయితీ. కానీ ఇప్పుడు వీధుల్లో వీటిని తయారు చేయడం లేదు. మార్కెట్‌లో ప్యాకెట్ల రూపంలో అమ్మకం చేస్తున్నారు.
– ఇప్పిలి సురేష్, ఇప్పిలి వీధి, శ్రీకాకుళం

నలుగు.. శరీరానికి వెలుగు



భోగి పర్వదినం రోజున చిన్నారులు, పెద్దలకు నలుగు పట్టించడం ఆనవాయితీ. శనగపిండి, మీగడ, బియ్యపు పిండి, మినప పిండి, నువ్వుల నూనెతో ఈ మిశ్రమాన్ని తయారు చేసి శరీరానికి పట్టిస్తారు. దీని వల్ల చర్మ సమస్యలు లేకపోవడంతో పాటు ఎముకలు గట్టిగా మారుతాయని ఆచార, సంప్రదాయాలు పాటించే వారు చెబుతున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

జనవరిలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా చలి మంటలను వేసుకుంటారు. కానీ భోగి మంటలనేవి కేవలం చలి తీవ్రత నుంచి తప్పించుకునేందుకు మాత్రమే కాదు.. ఆరోగ్య ప్రయోజనాల కోసం వేస్తారు. సంక్రాంతి పండక్కి సరిగ్గా నెలరోజుల ముందు ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే భోగి మంటల్లో వేస్తారు. వీటిని కాల్చడం వల్ల గాలి శుద్ధి అవుతుంది. సూక్ష్మ క్రిములు నశిస్తాయి. మనకు శ్వాసకోశకు సంబంధించిన అనేక రోగాల నుంచి ఉపశమనం లభిస్తుంది. భోగి మంటల్లో పిడకలతో పాటు రావి, మామిడి, మేడి, ఔషధ చెట్ల కలప, ఆవు నెయ్యి వేస్తారు. ఆవు నెయ్యి, ఆవు పిడకలను మంటల్లో వేయడం వల్ల శక్తివంతమైన గాలి విడుదలవుతుంది. అందుకే భోగి మంటలను ప్రతీ పల్లెటూరిలో విధిగా వేస్తారు. అంతేకాదు ఊళ్లో ఉండే వారందరినీ కులాలకు అతీతంగా అందరినీ ఒకేచోట చేర్చి, ఐక్యమత్యం పెంచడంలో కూడా భోగి ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఆచారం శ్రేష్టమైనది..



పూర్వం మన పెద్దలు పెట్టిన ఆచారాలు ఎంతో శ్రేష్టమైనవి. ఒంటికి నువ్వుల నూనె పట్టించి కాసేపు ఆరనిస్తే చర్మ మెరుస్తుంది. శరీరం గట్టిపడుతుంది. అలాగే నలుగుపిండి మన ఆరోగ్యానికి అవసరమైన పెసరపిండి, పసుపు, కచోరాలు, వట్టివేళ్లు వంటి సహజ వనరులతో తయారు చేస్తారు. మన శరీరంలో మాలిన్యాన్ని తొలగిస్తుంది.
– డాక్టర్ లక్ష్మీకాంత్ చిలుకు, శ్రీకృష్ణ నేచర్‌క్యూర్ హాస్పిటల్, శ్రీకాకుళం



బడ్డవానిపేటలో సందడిగా భోగి

నరసన్నపేట: మండలం బడ్డవానిపేటలో భోగి మంటను ఆదివారం సాయంత్రం వేశారు. గ్రామస్తులు తరఫున సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి భోగి మంటను అంటించారు. ఇతర గ్రామాల వలే కాకుండా ఒక రోజు ముందుగానే ఈ గ్రామంలో భోగి మంట వేయడం ఆనవాయితీగా వస్తోంది.

దారి దోపిడీ





ఈమె పేరు బొడ్డేపల్లి నీలిమ. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం చినరావుపల్లి గ్రామం. హైదరాబాద్ నుంచి సొంతూరుకు పయనమయ్యారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వరకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో వచ్చారు. విశాఖపట్నం వరకు ట్రావెల్స్ నిర్వాహకులు రూ. 3800వసూలు చేశారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వచ్చేందుకు మరో రూ. 220 టిక్కెట్ అయింది. మొత్తంగా హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం రావడానికి నీలమకు రూ. 4,200 ఖర్చు అయింది.



ఈమె పేరు బొత్స పద్మ ప్రియ. శ్రీకాకుళానికి చెందిన విద్యార్థిని. హైదరాబాద్‌లో ఒక ఎగ్జామ్ రాసేందుకు వెళ్లాల్సి వచ్చింది. ఇటువైపు నుంచి విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు దొరికింది. కానీ, రిటర్న్ రావడానికి రైలు టిక్కెట్ దొరకలేదు. 20 రోజుల ముందే ప్రైవేటు ట్రావెల్స్‌లో టిక్కెట్ బుక్ చేసుకున్నారు. 20 రోజుల ముందు బుక్ చేసినా సంక్రాంతి రద్దీని ముందే గమనించిన ఆ ట్రావెల్స్ ఆపరేటర్ రూ. 4220.95 చార్జీ అని, జీఎస్టీ అని మరో రూ.780వసూలు చేశారు. విచిత్రమేమిటంటే జారీ చేసిన టిక్కెట్‌లో జీఎస్టీ కోసం మినహాయించిన మొత్తాన్ని చూపించలేదు. ముందు చూపుతో 20రోజుల ముందు బుక్ చేయకపోతే నా పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉండేదో అని పద్మప్రియ వాపోయింది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

- సంక్రాంతి ప్రయాణాలకు అదనపు చార్జీలు
- బస్సులు, రైళ్లలో ఖాళీలేక ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్న జనం
- అదను చూసి సొమ్ము చేసుకుంటున్న ట్రావెల్స్

సంక్రాంతి పండగ వేళ ప్రజలపైన ప్రైవేటు ట్రావెల్స్ వీర బాదుడు బాదుతున్నాయి. ఇష్టానుసారంగా చార్జీలు పెంచేస్తున్నాయి. రైళ్లు కిక్కిరిసిపోవడం, బస్సుల్లో సీట్లు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవాళ్లు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించక తప్పడం లేదు. దీంతో టిక్కెట్ ధరలు అమాంతం పెంచేసి దోచేస్తున్నాయి. తొలుత సీట్లు లేవంటూ బెంబేలెత్తించి, బతిమలాడితే ఒకటి రెండు సీట్లు ఉన్నాయని నమ్మిస్తూ చివరి నిమిషంలో డబుల్, త్రిబుల్ రేట్లతో షాక్‌కు గురి చేస్తున్నాయి. సంక్రాంతి జిల్లా ప్రజలకు పెద్ద పండగ. విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, ముంబై, పుణె, ఢిల్లీ వంటి నగరాల్లో ఉన్న వారంతా స్వగ్రామానికి రావాలని ఆరాట పడుతుంటారు. రద్దీ దృష్ట్యా రైల్వే, ఆర్టీసీ అధికారులు ప్రత్యేక రైళ్లు, బస్సులు నడపాల్సి ఉండగా, అనుకున్నంతగా సర్వీసులు నడపకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి పరిస్థితి వచ్చింది. ఇదే అదునుగా ట్రావెల్స్ యాజమాన్యాలు రెండింతలు, మూడింతలు చార్జీలను వసూలు చేస్తున్నాయి.

నియంత్రణ శూన్యం

ట్రావెల్స్ యాజమాన్యాలు రెండు మూడు రెట్లు పెంచి చార్జీలు వసూలు చేస్తున్నా చర్యలు తీసుకున్న నాథుడు లేదు. చార్జీల నియంత్రణకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవడానికి కనీసం ప్రయత్నించలేదు. ఒకవైపు రైళ్లు రద్దీగా ఉండటం, ఆర్టీసీ బస్సులు పెంచకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్‌ను జిల్లా ప్రయాణికులు ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పుడే ఇంత భారం ఉంటే తిరుగు ప్రయాణంలో ఇంకెంత బాదుడు ఉంటుందోనన్న ఆందోళన ప్రయాణికుల్లో ఉంది.

వివిధ ప్రాంతాల నుంచి శ్రీకాకుళం నగరానికి చార్జీల వివరాలు

ప్రాంతం	జనవరి 1వరకు ఉన్న రేట్లు	సంక్రాంతికి సమీపించిన వేళ రేట్లు
హైదరాబాద్	రూ.1300నుంచి 1600	రూ. 4వేల నుంచి 5వేలు
విజయవాడ	రూ. 500నుంచి 900	రూ. 2వేల నుంచి 2500
తిరుపతి	రూ. 1500నుంచి 1900	రూ. 5వేల నుంచి 8వేలు



ప్రైవేటు ఆపరేటర్ డిమాండ్ చేసినంత ఇచ్చా..



హైదరాబాద్ నుంచి రావడానికి రూ.4వేలు ఇచ్చాను. సొంతూరు పాలకొండ రావడం కోసమని రైళ్ల కోసం ప్రయత్నించాను. ఖాళీ లేకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించాను. ఆపరేటర్ ఎంత డిమాండ్ చేస్తే అంత ఇవ్వాల్సి వచ్చింది.
– ఆనంద్‌నాయుడు, ప్రయాణికుడు, పాలకొండ

క్లుప్తంగా

కోడి పందాలపై దాడులు

రణస్థలం: మండలంలోని చిల్లపేట రాజం గ్రామ సమీపంలోని తోటల్లో కోడిపందెం శిబిరంపై జె.ఆర్.పురం పోలీసులు దాడి చేసినట్లు ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32,835, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు కోళ్లు, ఎనిమిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నరసన్నపేట: మండలం బాలసీమ–బసివలస మధ్య కాలువ గట్లపై ఆదివారం నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రాగా స్థానిక ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వెళ్లి పందాలను అడ్డుకున్నారు. 12 మందిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.14580, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గార: మండలంలోని కూర్మనాథపురం సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.15,450, శ్రీకూర్మం గ్రామ పరిసరాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.3150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని ఎస్‌ఐ ఆర్.జనార్దన తెలిపారు. కూర్మనాధపురం ఏరియాలో దొరికిన పేకాటరాయుళ్ల వద్ద నుంచి రెండు బైక్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, శనివారం బలరాం పురం పరిసరాల్లో దొరికిన వ్యక్తులే మరలా ఆదివారం కూడా ఉండటం, వీరిలో రూరల్ మండలం ఇప్పిలికి చెందిన టీడీపీ వ్యక్తులు కొందరు ఉండటంతో, వారిని తప్పించేందుకు గార పోలీసులపై సర్కిల్ వర్గాల నుంచి ఒత్తిడి వచ్చినట్టు తెలుస్తోంది.

కొత్తూరు: మండలంలోని మెట్టూరు సమీప తోటల్లో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2530 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



గార: మానసిక సంఘర్షణతో ఇబ్బందులు పడుతున్న ఓ వ్యక్తి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గార పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సతివాడ గ్రామానికి చింతల రమణమూర్తి (58) ఈ నెల 10న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ఉప్పరవీధికి చెందిన రవ్వ కృష్ణారావు ఆదివారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై బి.లావణ్య తెలిపారు. అదే వీధిలో నివాసముంటున్న ఇద్దరు వ్యక్తులు కృష్ణారావుని ప్రతిరోజూ హేళన చేస్తుండటంతో ఈ ఘటనకు పాల్పడినట్లు చెప్పారు. 'నీకు బీపీ, సుగర్ ఉంది.. నువ్వు ఎందుకూ పనికిరావు అంటూ పదేపదే హేళన చేస్తుండటంతో మనస్థాపం చెందిన కృష్ణారావు అయ్యప్ప స్వామి గుడి కింద నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గ్రామస్తులు గమనించి వెంటనే పాతపట్నం సామాజిక ఆస్పత్రికి తరలించారు. శరీరం కాలిపోయి పరిస్థితి విషమంగా మారింది. బాధితుడు ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ అమీర్ ఆలీ

కొత్తూరు: మండలంలోని జన్నోడుగూడతో పాటు తివ్వకొండ ప్రాంతాల్లో ఉన్న పలు గిరిజన గ్రామాల సమీపంలో సారాబట్టీలపై దాడులు నిర్వహించారు. సీఐ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తన సిబ్బందితో దాడులు చేపట్టి వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. వంద లీటర్ల సారా, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల విస్తృత ప్రచారం



ప్రచారంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ జనార్దన

గార/రణస్థలం: సంక్రాంతికి దూర ప్రాంతాలకు వెళ్లే వారంతా దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని గార ఎస్‌ఐ ఆర్.జనార్దన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆటో ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పిక్కాట, పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన చర్యలు తప్పవని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి హెచ్చరించారు. ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు.

అమ్మవారి ఆలయం ఎదుట క్యూలైన్లు



రారండోయ్ జాతర చూద్దాం

- రేపటి నుంచి కోటపాలెం భద్రమహంకాళీ అమ్మవారి జాతర
- రెండు రోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

రణస్థలం:

ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతిగాంచిన రణస్థలం మండలం కోటపాలెం శేరిలో కొలువైన భద్రమహంకాళి అమ్మవారి జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా సంక్రాంతి నాడు ప్రారంభమై ముక్కనుమతో ముగిసే ఈ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. సంక్రాంతి ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. కనుమ నాడు భారీగా కోళ్లు, పొట్టేళ్లతో మొక్కులు తీర్చుకుంటారు. కొత్త వాహనాలు ప్రారంభించడం ఇక్కడ ప్రత్యేకత. మూడు రోజు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా వెలుగుల మధ్య జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాం నుంచి ఈ జాతర నిర్వహణపై ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ వహించడంతో యాత్ర కనులపండువగా జరుగుతోంది.



ప్రత్యేక అలంకరణలో భద్రమహంకాళి అమ్మవారు

కోర్కెలు తీర్చే కల్పవల్లి..

ఉత్తరాంధ్ర జిల్లాలోని శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో మత్స్యకారుల ఆరాధ్య దైవంగా, ఇతర వర్గాల భక్తులు కోరుకున్న కోర్కెలు తీర్చే కల్పివల్లిగా భద్రమహంకాళీ అమ్మవారు ఖ్యాతి గాంచింది. మత్స్యకారులు దూర ప్రయాణాలు చేయలన్నా, సముద్రంలో మత్స్యవేటకు వెళ్లాలన్నా, ఇంట్లో ఏ పండుగ చేసుకోవాలన్నా భద్రమహంకాళి అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకుని బయలుదేరుతారు. గొర్లె శ్రీరాములునాయుడు కుటుంబీలుఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్వహణ బాధ్యతలు చూస్తుంటారు. ఆచారం ప్రకారం అమ్మవారి విగ్రహంపై ఎటువంటి గోపురం లేకుండానే భక్తులకు దర్శనం ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత.

అన్ని సౌకర్యాలు కల్పించాం..



భద్రమహంకాళీ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరుపుతున్నాం. అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కమిటీని నియమించాం. జాతర ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నీ ఏర్పాట్లు చేశాం. – గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే, పొతర్లపల్లి



ఆకర్షణీయంగా జెయింట్ వీల్

వైవిధ్యభరితంగా మొక్కుల చెల్లింపు..

పరిసర ప్రాంతాల భక్తులు కొత్త వాహనాలు కొంటే భద్రమహంకాళీ అమ్మవారి సన్నిధిలో పూజలు చేసి ప్రారంభించడం ఆనవాయితీ. గ్రామాల్లో వారాల పండుగ చేసుకోవాలన్నా, కనుమ, దసరా వంటి ప్రత్యేక పండుగ రోజుల్లో అమ్మవారికి కోళ్లు, మేకలు, పొట్టేళ్లను మొక్కులుగా చెల్లించుకుని అనంతరం పనులు మొదలు పెడతారు. కనుమ రోజు వేకువజాము నుంచే గ్రామంలో సందడి మొదలవుతుంది. ఆ ప్రాంతమంతా అత్యంత రద్దీగా ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా భద్రమహంకాళి అమ్మవారి కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాల అలంకరణలు, బాణసంచా వెలుగులతో అమ్మవారి జాతర కనువిందు చేస్తుంది.

'వికసిత్ భారత్'లో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రధాన మంత్రి నిర్దేశించిన వికసిత్ భారత లక్ష్యాన్ని చేరుకోవడానికి దేశ ప్రజలందరూ కృషి చేయాలని, ముఖ్యంగా యువత ముందుకురావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సూర్యమహల్ కూడలి వద్ద ఆదివారం సెట్‌శ్రీ, నెహ్రూ యువ కేంద్రం, జేసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద 162 వ జయంతి ఉత్సవాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలామంది ప్రతిభ కలిగిన విభిన్న రంగాలకు చెందినవారు ఉన్నారనీ, వారికి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చేలా అందరం కృషి చేయాలన్నారు. యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా మూలపేట పోర్టు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నాలుగు లైన్ల జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరిస్తున్నామని తెలిపారు.అనంతరం వివేకానంద పుస్తకాన్ని ఆవిష్కరించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కాపవరపు నరసింహమూర్తి రాసిన 'విశ్వానికి దిక్సూచి ఆ గురుశిష్యుల మార్గం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేఎస్ మూర్తి, జేసీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు జామి భీమశంకర్, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, కమిషనర్ ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ సుధీర్, సురంగి మోహన్‌రావు, మాదారపు వెంకటేష్, అరవల రవీంద్ర, శీర రమణయ్య, కూన అనిల్, తమ్మినేని ఉషారాణి, వరలక్ష్మి కవ్వాడి సుశీల తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలో తల్లిదండ్రులు, కుటుంబ ఆదరణ లేని దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు నూతన వస్త్రాలు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు, స్టడీ మెటీరియల్‌ను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావులతో కలిసి కేంద్రమంత్రి పంపిణీ చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

హిరమండలం: మండలంలోని గొట్ట గ్రామంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గొట్ట యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీకాకుళంలోని సన్‌రైజ్ హాస్పిటల్, లైన్స్ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ 62 మంది రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచి దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు, ప్రాంతీయ వైద్యులు ఈశ్వరరావు, లైన్స్‌క్లబ్ సభ్యులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందుల చీటీ రాస్తున్న డాక్టర్

రద్దీగా రైళ్లు



ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం వలస వెళ్లినవారంతా సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామాలకు చేరుకునేందుకు వస్తుండటంతో ఆదివారం శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ రద్దీగా కనిపించింది. రైళ్లన్నీ కిక్కిరిసి పోయాయి. –ఆమదాలవలస



కారు ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన సారవకోట లక్ష్మి

సారవకోట: మండల కేంద్రం సారవకోటలో ఆదివారం కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకురావడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి పర్లాకిమిడి మీదుగా శ్రీకాకుళం వెళ్తున్న కారు సారవకోట వచ్చే సరికి రోడ్డు పక్కనే మటన్ వ్యాపారం చేసుకుంటున్న వారి పైకి దూసుకొచ్చింది. మటన్ వ్యాపారి భార్య సారవకోట లక్ష్మిని ఢీకొని అక్కడి నుంచి కొంత దూరం వెళ్లి పారిశుద్ధ్య కార్మికురాలు జయమ్మను ఢీకొట్టింది. కారుకు అడ్డంగా మటన్ కొట్టే దుక్క అడ్డుగా ఉండటంతో మరింత ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మాంసం నేలపాలు కావడంతో సుమారు రూ.18 వేలు నష్టం వాటిల్లింది. గాయపడిన వారిని సారవకోట పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో నరసన్నపేట నుంచి శ్రీకాకుళం తీసుకెళ్లి చికిత్స అందించారు. ఆసుపత్రి వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. కారు డ్రైవర్ నిద్రమత్తు వల్లే కారు అదుపు తప్పినట్లు సమాచారం.

ఉత్తరాంధ్ర క్విజ్ పోటీల విజేత నెల్లిమర్ల

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర క్విజ్ పోటీల్లో విజయనగరం జిల్లా నెల్లిమర్ల జట్టు విజేతగా నిలిచింది. తొలుత ఈ పోటీలను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో స్థానిక వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. నెల్లిమర్ల జట్టు ప్రథమ, పూండి జట్టు ద్వితీయ, మందస మండలం భేతాళపురం జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. మొత్తం 70 జట్లు హాజరుకాగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి టాప్ 10 జట్లు ఎంపిక చేసి నిర్వహించారు. విజేత జట్లకు సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల విజేతకు ట్రోఫీ అందజేస్తున్న సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

మూడున్నర దశాబ్దాల ముచ్చట



ఒకటి కాదు రెండు కాదు ముచ్చటగా మూడున్నర దశాబ్దాల తర్వాత ఆ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. గార మండలం అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఒకేచోటకు చేరి సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. బ్యాచ్‌కు గుర్తుగా మొక్కలు నాటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. అదే పాఠశాలలో 1992-93 విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కూడా ఘనంగా నిర్వహించారు. - గార

● సందడిగా సంత



సంక్రాంతి పండుగ నేపథ్యంలో గార మండల కేంద్రంలో ఆదివారం ప్రత్యేక సంత(భోగి సంత) నిర్వహించారు. ఇక్కడ కొనుగోలు చేసిన దుస్తులు, చెరుకు గెడలు, కొత్త కుండలు, కలగూరను పెద్దలకు చూపడం ఆనవాయితీ. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి వచ్చిన వారితో సంత కిటకిటలాడింది. - గార

అలరించిన సంక్రాంతి జానపద సంబరాలు



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు, నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్/పలాస: పలాస నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతంలో సంక్రాంతి సందర్భంగా రంగోయి, రాజాం గ్రామాల్లో నిర్వహించిన జానపద సంబరాలు ఉర్రూతలూగించాయి. ఆదివారం రాజాంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సిక్కోలు జానపద కళాజాతరకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే గౌతు శిరీష, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు, ప్రజా గాయకులు నల్లగొండ గద్దర్, వంగపండు ఉషా తదితరులు హాజరయ్యారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కళాకారులు హాజరై ఆట పాటలతో అలరించారు. ప్రజా గాయకుడు గద్దెరును గుర్తు చేసుకుంటూ ఆయన పాడిన పాటలతో గాయకులు ఉర్రూతలూగించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాల్‌తో పాటు కళాకారులకు నిర్వాహకులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో గాయకులు ఉదయ్ భాస్కర్, రేలారే రేలా జానకిరావు, కృష్ణవేణి, రఘు, షేక్ ష్మారిక, సన్నశెట్టి రాజశేఖర్, రాపాక ధనరాజ్, బోనెల గోపాల్, కుత్తుం లక్ష్మణ్, కొంచాడ సత్యవీర్, కుమార్ నాయక్, తామాడ ప్రదీప్, ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్‌కుమార్, మాజీ ఎంపీపీ వసంతస్వామి, సర్పంచ్ పిట్ట గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన కాంప్లెక్స్



ప్రయాణికులతో రద్దీగా కనిపించిన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం కాంప్లెక్స్ ప్రయాణికులతో ఆదివారం కిటకిటలాడుతూ కనిపించింది. తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, విజయవాడ వంటి దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకోవడంతో కాంప్లెక్స్ ప్రయాణికులతో కళకళలాడుతూ కనిపించింది. ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, హిరమండలం, కొత్తూరు, బత్తిలి, టెక్కలి, రాజాం, బొబ్బిలి వంటి మారుమూల దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు రద్దీగా కనిపించాయి.

కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలి



అరిణాం అక్కివలసలో ర్యాలీ నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ సబ్ కమిటీ ప్రతినిధులు కోరారు. ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల నుంచి విషపూరిత వాయువులు, జలకాలుష్యం నియంత్రించాలన్నారు. కాలుష్యం వల్ల సమీప గ్రామాల ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు గిరిధర్, కామేశ్వరరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పండగ కానుక



కొత్తూరు : మెట్టూరు బిట్-3 ఆర్.ఆర్.కాలనీలోని ఓ వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంచుతున్న హేమలత

కొత్త దుస్తులు ధరించకపోతే పండగ వచ్చినట్టే ఉండదు. శ్రీకాకుళం గ్రేస్ హెల్పింగ్ హేండ్స్ సభ్యులు వృద్ధాశ్రమ వాసులకు ఆ సరదా తీరుస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా హిరమండలంలోని ప్రేమ సాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం నూతన వస్త్రాలతో పాటు నాలుగు నెలలకు సరిపడా కిరాణా, కాస్మోటిక్ సామగ్రి అందజేశారు. నాలుగేళ్లుగా ఈ క్రతువు నిర్వహిస్తున్నామని సంస్థ కో ఆర్డినేటర్ హేమలత తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాలకొండ రమణ, వైవీ రమణ, మెట్టబాను ప్రతాప్, జనార్ధర్‌రావు, తేజ మాస్టర్, సోమేష్, అండాలమ్మా, విజయలక్ష్మి, మండల సత్యసేవా సంస్థ జోనల్ కన్వీనర్ చంటి మాస్టర్, ఆశ్రమ అధ్యక్షుడు ఏవీ అబ్బాయి కమిటీ సభ్యులు జోషుల గోవింద శర్మ,సమితి కన్వీనర్, వెంకటరమణ, ఆశ్రమ మేనేజర్ జయరాం తదితరులు ఉన్నారు. - హిరమండలం/కొత్తూరు



హిరమండలం ఆశ్రమ వాసులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు